# అట్ట'హాసం'

ఎకౌంటెంట్‌గారితో మాట్లాడుతున్న సారథి దగ్గరకెళ్ళి సుబ్రహ్మణ్యం-

"ఇందులో ఓ సంతకం పడేయండి బిల్లు మీ టేబులు మీద ఉంది గానీ" అన్నాడు.

నిజానికి రికార్డు ప్రేసరు సుబ్రహ్మణ్యం చెప్పింది పూర్తిగా వినిపించుకోకపోయినా, ఓ సంతకం గిలికి మళ్ళీ తీవ్ర చర్చలలో మునిగిపోయాడు సారథి-

విషయం సీరియస్‌గా ఉంది. ఒక్కొక్క క్లర్కు మూడువందలు నేమ్సు ఆడిట్ చెయ్యాలా, మూడు వందల యాభయి చెయ్యాలా? ఎన్ని చేస్తే ఆడిట్ క్వాలిటీ ఉంటుంది? అసలు ఎన్ని నేమ్సు ఆడిట్ ఖచ్చితంగా చెయ్యగలడో గుమస్తా? ఇంతవరకు ఆ బిల్ ఆడిట్‌కి నారమ్స్ ఎందుకు నిర్ణయించలేదు? గుమస్తా అంటే గొడ్డుచాకిరీ చెయ్యాలా? ఏమైనా తప్పొప్పులు వస్తే అంతా హాయిగా తప్పించుకుంటారు. చిరుద్యోగులమైన మామీద పెడతారు అంటూ వాదోపవాదాలు, ఆర్గ్యుమెంట్‌లు, అభియోగాలు జరుగుతున్నాయి ఎకౌంటెంట్‌గారి సీటుదగ్గర నిజంగా అది గుమస్తాలకీ, సూపర్‌వైజర్‌లకి మధ్య జరుగుతున్న మర్యాదయిన యుద్ధం.

పనితనంలో నేర్పు సంపాదించడం వల్ల గానీ, తెలివితేటల వల్ల గానీ ఎవ్వరికీ ప్రమోషన్లు రావు. తమకింద వారు కాలుకి, మెడకి వాదాలు వేస్తూ మొరాయిస్తూ, మొండికేస్తే, వాళ్ళకి లొంగకుండా తనూ అంతకి రెండింతలు ముళ్ళు వెయ్యగల శక్తిని సంపాదించుకుంటే అదే ప్రమోషన్‌కీ అర్హత.

అందుకే ఎకౌంటెంట్‌గారు ఖచ్చితంగా చెప్పారు. "ప్రతి గుమాస్తా మూడొందల

యాభయి నేమ్సు ఆడిట్ చేసి, ఇరవై తొమ్మిదో తారీఖునాటికి నా టేబుల్ మీద పెట్టాల్సిందే" అని.

విసుగ్గా వచ్చితన సీట్లో కూర్చున్నాడు సారథి. ప్రసాదు నెమ్మదిగా వచ్చి "సారూ, మీరు హీటెక్కిపోయినట్లున్నారు. ఈ అందమైన బొమ్మ చూడండి హాయిగా ఉంటుంది" అంటూనే ఆఫీస్‌బోయ్ కావడం వల్ల బెల్లు వినిపించినవైపు పరుగుపెట్టాడు. నిజంగా ఆ బొమ్మకేసి చూడంగానే మండుటెండలోంచి ఏ.సి. రూంలోకి వచ్చినట్లనిపించింది సారథికి. మధ్యకి మడచిన న్యూస్‌పేపర్ మీద నిలువెత్తున నిలబడిన అందాల తార శ్రీదేవి బొమ్మ అది. ఎంత అందంగా వయ్యారంగా ఉందనీ అది. చిన్న నిక్కరు, బనీను వేసుకొని ఎత్తుమడమల జోళ్ళు, చేతిలో రంగుల పువ్వులల గొడుగు - కళ్ళలో చిలిపితనం, కవ్వించే ఆడతనం, కనురెప్పలు వేయనీయని కమనీయమైన చివురుటాకుల్లాంటి చిరుపెదవులు... సారథి ఆదమరచి చూస్తానే వున్నాడు. మూర్తీభవించిన సౌందర్యదేవత అని పదే పదే అనుకుంటున్నాడు. తదేకంగా చూస్తున్నాడు. అంతా ఎవరి హడావుడిలో వారున్నారు. ఎవరూ తనని పట్టించుకోక పోయినా అతనికి తనివితీరలేదు. ఆ బొమ్మ వంక ఇంకా ఎంతసేపైనా చూస్తూ వుండాలనే వుంది. అయిష్టంగా ఆ పేపరు తీసి డ్రాయరు సొరుగులలో వేసి- అన్యమనస్కంగా పని మొదలుపెట్టాడు..

మూడు రోజులు ముమ్మరంగా జరిగే సెలరీబిల్ ఆడిట్ సారథి ఈసారి కసిగా చేశాడు. ఎల్.పి.సి. రాలేదని కొందరి జీతాలు కోశాడు. మస్తరులో తప్పులున్నాయని కత్తిరింపులు చేశాడు. ఆఫీసరు సంతకాలు అన్నిచోట్లా లేవనీ - అవనీ ఇవనీ ఆరు కాగితాల అబ్జక్షన్సు రిపోర్టు తయారుచేశాడు. అది ఆఖరి రోజు. వచ్చిన బిల్లులన్నీ లెక్కచూసి పంపాల్సిన రోజు. సారథి చేస్తున్న డిపో మేనేజర్ గారి బిల్లు ఎక్కడా కనిపించలేదు. కనపడుటలేదనే వార్త దావానలంలాగా ఆఫీసంతా వ్యాపించింది - ఫ్యాన్లు వెదకటం మొదలుపెట్టారు. కొంతమంది గుమస్తాలు కూడా సానుభూతితో తమ సీట్లు వెదికి వారి దగ్గర లేదని ఖాయం చేశారు.

సారథికి వొళ్లు మండిపోయింది. అన్ని బిల్సుతో కలిసి నాకా బిల్లు రాలేదని ఢంకా మీద దెబ్బకొట్టి చెప్పాడు - ఎకౌంటెంట్ గారు "వెదకండి వెదకండి" అంటూ ... బంగారు మామిడిపండు కోసం మహారాజుగారు తన పరివారాన్ని నాలుగు వైపులకీ పంపినట్లు, అందర్నీ ఆదేశించారు. చివరిగా సారథి అసలు నాకా బిల్లు

డాక్‌లోంచి రాలేదన్నాడు. అన్న అరక్షణంలో సుబ్రహ్మణ్యంగారు డాక్ రిజిష్టర్ తెచ్చి సారథి సంతకం చూపించారు. సారథికేం చెయ్యాలో పాలుపోలేదు. బిల్లు తీసుకుని పోగొట్టినందుకు – ముందు మెమొ, తర్వాత ఛార్జిషీటు – అలా – అలా ఏమైనా జరగచ్చు. మనసంతా చికాకుగా అయిపోయింది. అంత దెబ్బలాడిన ఎకౌంటెంట్ గారి దగ్గరకెళ్ళి "సార్, ఓసారి డిపోకి ఫోన్ చేస్తాను" అన్నాడు.

ఆయన అవకాశాన్ని జారవిడుచుకోకుండా "ఏమయ్యా! జాగ్రత్త వుండాలి. నువ్వు తీసుకున్నావు. మరెక్కడ పెట్టావు? డిపోకి ఫోన్ చేసి ఏం చెప్తావు?" అన్నారు.

"డూప్లికేట్ పంపమని చెప్తాను సార్" అన్నాడు తలొంచుకుని. సారథి లాంటి చాకులాంటి కుర్రాడలా ఓడిపోవడం ఎకౌంటెంట్‌కి కూడా ఏమి బాగాలేదు. "సరే కానీయండి" అన్నాడు. మిట్టమధ్యాహ్నం ఎండలో చెమటలు కక్కుతూ డిపో గుమస్తా పరుగెట్టుకొచ్చాడు. "ఏంటి గురూ! మా డి.ఎమ్. చండశాసనుడు డూప్లికేటు మీద సంతకమంటే నానా గొడవానూ– అయినా ఎలా పోయింది గురూ" అన్నాడు ఆయాసంగా – సారథి ముఖం నల్లగా మారిపోయింది.

"ఆయనే వుంటే అరటాకెందుకని సామెత! ఎలా పోయిందో తెలిస్తే బాధేముంది" అన్నాడు.

"అదేంటి గురూ! నిలువెత్తున నిలబడిన శ్రీదేవి బొమ్మున్న పేపరు అట్టవేశాను గురూ" అన్నాడు. సారథి ఉలిక్కిపడ్డాడు. చటుక్కున డ్రాయరు సొరుగు లాగాడు. సిరులొలికె కళ్ళతో చిలిపిగా నవ్వుతున్న శ్రీదేవి – బయటికి తీసి చూశాడు. లోపల ఒక్క పేజీ బిల్లు డి.ఎం.గారి ఒక్కరి కోసం ప్రత్యేకంగా వేసిన బిల్లు. అటూ ఇటూ దట్టమైన రెండేసి కాగితాల అట్టలు. ఈ మూడు రోజుల్లో ఆ బొమ్మని కనీసం మూడొందలసార్లు చూశాడు తను.

ఆ బొమ్మను వెనక్కి మడిచి లోపలి డి.ఎం.గారి బిల్లు ఆడిట్ చేస్తుంటే సారథిలో దుఃఖంలోంచి నవ్వు వికటాట్టహాసం చేసింది.